# కేసీఆర్‌ను కలిసిన వద్దిరాజు



## కేటీఆర్, హరీశ్‌లకూ రవిచంద్ర, తాతా మధు న్యూ ఇయర్ విషెస్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.





# ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

## కొణిజర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులకు ఆంగ్ల భాషపై ఉన్న నైపుణ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్

కొణిజర్ల, జనవరి 3: విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకునే ఉవకాశం ఉన్నదని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కొణిజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఎస్సీఈఆర్టీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మండలస్థాయి తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంగ్లిష్‌లో విద్యార్థుల వ్యక్తిత్వ నైపుణ్యాలను స్వయంగా విని అభినందించారు. సుమారు అరగంటపాటు వారితో ఉండి.. అప్పటికప్పుడు ఆంగ్లంలో సంభాషణ చేయించారు. వారికి సలహాలు, సూచనలు అందించారు. వారి భాషా సామర్థ్యాలను మెచ్చుకున్నారు. రాబోయే 6 నెలల కాలంలో తరగతి గదిలో, బయట కూడా ఆంగ్లంలోనే మాట్లాడుతామని విద్యార్థులతో మాట తీసుకున్నారు. విద్యార్థులను ఆంగ్లంలో మెరికల్లా తీర్చిదిద్దిన ఆయా ఆంగ్ల ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఈఎల్‌టీపీ నాయకులకు సూచించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ఎ.సోమశేఖర శర్మ, ఎంఈవో డీ.అబ్రహం, ఈఎల్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి జగదీష్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సంక్రాంతి రవికుమార్, మండల కోఆర్డినేటర్ ఎం.భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: సీపీ



మామిళ్లగూడెం, జనవరి 3: పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సునీల్‌దత్ హెచ్చరించారు. రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో కోడి పందేలను నివారించే దిశగా చేపట్టిన చర్యల్లో భాగంగా శుక్రవారం పోలీస్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కోడి పందేలను నియంత్రించేందు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కోడి పందేలు, జూదం నిర్వహించేందుకు తోటలు, ఖాళీ భూములు, అతిథి గృహాలు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బెట్టింగ్, పేకాట శిబిరాలపై సైతం దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు.

### చైనా మాంజా విక్రయించొద్దు..

మనుషులు, పక్షులు, జంతువులకు హాని కలిగించే చైనా మాంజా విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. దీనిపై ఎస్‌హెచ్‌వోలు ప్రత్యేకంగా దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాంజా అమ్మకాలు, వినియోగంపై పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేషన్ బియ్యం సరఫరాలో తీవ్ర ఆటంకం ఏర్పడింది. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హమాలీలు సమ్మెకు దిగడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా జనవరి నెలలో 443 రేషన్ డీలర్ల ద్వారా ప్రభుత్వం 4,350 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల ఇప్పటివరకు కేవలం 35 శాతం బియ్యం మాత్రమే రేషన్ డీలర్లకు చేరింది. మిగతా 65 శాతం బియ్యం ఇంకెప్పటికి చేరుతుందో ప్రశ్నార్థకంగా మారింది. హమాలీలతో చర్చలు జరుపుతున్న సివిల్ సప్లై అధికారులు మరోవైపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. అధికారుల ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో వేచిచూడాలి. ఏదేమైనా లబ్ధిదారులకు ప్రతినెలా 'రేషన్' సమయానికి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–అశ్వారావుపేట, జనవరి 3

### ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లు ఇవే..

- ప్రభుత్వం 50 కిలోల బస్తాకు ఇస్తున్న రూ.26 కూలి అదనంగా రూ.3 పెంచింది. ఈ పెంచిన ధరను 2024, జనవరి నెల నుంచి అమలు చేస్తామని తెలంగాణ సివిల్ సప్లయీస్ కమిషనర్ అంగీకరించారు.
- మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యం బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలకు అదనంగా రూ.1000 పెంచారు.
- ప్రస్తుతం ఉన్న రూ.6,500 బోనస్‌ను రూ.7,500లకు పెంచారు.
- యూనిఫాం స్టిచ్చింగ్ (కుట్టు చార్జీలు) రూ.1,300 నుంచి రూ.1,600లకు పెంచారు.
- దసరా పండుగ స్వీట్ బాక్స్ రూ.800 నుంచి రూ.900లకు పెంచారు.
- హమాలీల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం అమలుకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
- గోదాములలో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.
- సివిల్ సప్లయీస్ హమాలీల లాగా జీసీసీ కార్మికులకు కూడా పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

- డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న హమాలీలు
- రేషన్ బియ్యం సరఫరాలో తీవ్ర ఆటంకం
- చౌక ధరల దుకాణాల వద్ద నిలిచిన పంపిణీ
- ఇబ్బంది పడుతున్న డీలర్లు, లబ్ధిదారులు

## అయోమయంలో రేషన్ డీలర్లు



బియ్యం పంపిణీపై రేషన్ డీలర్లకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతుండడంతో అయోమయంలో ఉన్నారు. జిల్లాలో 443 రేషన్ దుకాణాల పరిధిలో 2,93,268 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ కార్డులు 21,149, అన్నపూర్ణ కార్డులు 3, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 2,72,116 కార్డులు ఉన్నాయి. గిడ్డంగుల వద్ద బియ్యం బస్తాలను వాహనాల్లోకి ఎక్కించడం, రేషన్ దుకాణాల వద్ద దిగుమతి చేయడం హమాలీలే చేస్తుంటారు. ఇందుకు 50 కిలోల బస్తాకు ప్రభుత్వం రూ.26 చెల్లిస్తుంది. ఈ ధర పెంచాలని కార్మికులు కోరితే 3 నెలల క్రితం ప్రభుత్వం అదనంగా రూ.3 పెంచింది. అయినప్పటికీ పెంచిన ధరపై జీవో జారీ చేయకపోవడంతో ఓపిక నశించిన హమాలీలు సమ్మెకు దిగారు.




దమ్మపేట సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న హమాలీలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హమాలీలు ఈ నెల 2వ తేదీ నుంచి సమ్మెకు దిగారు. దీంతో గోడౌన్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ఈ నెల 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాల్సిన డీలర్లు పూర్తిస్థాయి కోటా అందక అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు నిర్దేశించిన బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. హమాలీలు సమ్మెకు దిగడంతో ఈ బియ్యం ఎప్పటికి అందుతుందోననే డీలర్లు ఆందోళన చెందుతున్నారు. సరిపడా బియ్యం నిల్వలు గోడౌన్లలో నిల్వ లేకపోవడంతో సరఫరా నత్తనడకన సాగుతోంది. త్వరలోనే పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్ దొడ్డుబియ్యమే సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నదని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.

### లబ్ధిదారులకు ఇక్కట్లు

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు రేషన్ దుకాణాల ద్వారా జనవరి నెల బియ్యం అందుకోవడానికి ఇబ్బందులు తప్పేటట్లు లేవు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని చెబుతున్న హమాలీలు ఎప్పుడు విరమిస్తారో తెలియడం లేదు. హమాలీల డిమాండ్లపై ప్రభుత్వ స్పందన కనిపించడం లేదు.

## రెండో రోజుకు చేరిన జీసీసీ హమాలీల సమ్మె

దమ్మపేట/ భద్రాచలం, జనవరి 3: 2024 అక్టోబర్‌లో జరిగిన జీసీసీ, సివిల్ సప్లయీస్ రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హమాలీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట, భద్రాచలం మండల కేంద్రాల్లో చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరింది. సమ్మెకు సీపీఎం, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హమాలీ ఎగుమతి, దిగుమతి రేట్లను జనవరి నుంచి అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం హమాలీ రేట్ల పెంపు జీవోను విడుదల చేసి ఎరియర్స్‌కు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు సీపీఎం అండగా ఉంటుందని, వారి సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు.



భద్రాచలంలో సమ్మె చేస్తున్న జీసీసీ హమాలీలు

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..



హమాలీల సమ్మె కారణంగా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా నిలిచిపోయింది. దీనికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా జనవరి నెలకు 4,350 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 35 శాతం బియ్యం రేషన్ దుకాణాలకు చేరాయి. మిగతా 65 శాతం బియ్యం సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నాం. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

–త్రినాథ్, డీఎం, సివిల్ సప్లయీస్, భద్రాద్రి కొత్తగూడెం

# భద్రాచలంలో కొనసాగిన సీఆర్టీల నిరసన దీక్ష



సమ్మె శిబిరం వద్ద సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సీఆర్టీలు

భద్రాచలం, జనవరి 3: ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీలు) భద్రాచలం ఐటీడీఏ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 15వ రోజుకు చేరాయి. దీక్షల్లో భాగంగా భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను సమ్మె శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు సరస్వతి, రూప మాట్లాడుతూ మాట్లాడుతూ అందరు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, హైకోర్టు ఇచ్చిన మినిమం టైమ్ స్కేలు అమలుపర్చాలని, మహిళలకు ప్రసూతి సెలవులు 180 రోజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజేశ్, భాస్కర్, భూక్యా కోటయ్య, సురేశ్, సక్రు, నిర్మల, కమల జ్యోతి, వెంకట్, పాంచాలి, నిర్మల, సునీత, వెంకటరమణ, బుచ్చయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మేసిన పొగమంచు

మండల వ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున పొగమంచు కమ్మేసింది. బారెడు పొద్దెక్కినా మంచుతెరలు తొలగకపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, వాహనదారులు కాస్త ఇబ్బందిపడ్డారు. రహదారులపై లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. రైతులు పొగమంచులోనే తలపాగా కట్టుకొని పొలంబాట పట్టారు. ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఎంత తీవ్రతతో విభిన్న వాతావరణం కనిపించింది. –పెనుబల్లి, జనవరి 3



పెద్ద రోడ్డు వచ్చి చిన్న రోడ్డును మింగడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు అనంతంగా ఉన్నాయి. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా అడ్డుగా ఉందంటూ ఆర్‌అండ్‌బీ రోడ్డును మూసివేశారు. కనీసం అండర్ పాస్ ఇవ్వకుండా హైవేను పూర్తిచేశారు. రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో అండర్‌పాస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలిక ఉపశమనంగా నేరుగా హైవేను దాటేందుకు అనుమతిచ్చారు. తరువాత ప్రమాదాలు జరుగుతుండడంతో తాజాగా దాన్ని మొత్తాన్ని మూసివేశారు. దీంతో ఏళ్లకేళ్లుగా తాము రాకపోకలు సాగించిన రోడ్డు మూతబడడంతో పరిసర గ్రామాల ప్రజలు పడరాన్ని పాట్లు పడుతున్నారు. –ముదిగొండ, జనవరి 3

- హైవే నిర్మాణంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు మూసివేత
- గ్రామస్తులు, రైతులు, ప్రయాణికులకు ఇక్కట్లు
- అసలే అండర్ పాస్ లేకుండా నిర్మాణం పూర్తి
- ఆపై ఆందోళనలతో రోడ్డు దాటేందుకు అనుమతి
- ప్రమాదాలంటూ ఇప్పుడు మొత్తానికే మూత
- కొద్దిపాటి దూరానికీ కిలోమీటర్ల మేర ప్రయాస

రోడ్డు దాటకుండా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు



# రహదారి వచ్చింది.. రోడ్డును మింగింది..

365ఏ నంబరు గల ఖమ్మం–కోదాడ జాతీయ రహదారి ముదిగొండ మండలంలోని 4 గ్రామాల మీదుగా 8 కిలోమీటర్ల మేర ఉంది. అయితే, ముదిగొండ శివారులో సువర్ణాపురాన్ని, ముదిగొండను కలుపుతూ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఎన్నో ఏళ్లుగా వినియోగంలో ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఈ రోడ్డు ఎంతో ముఖ్యమైనది. ఇరు గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు నిత్యం ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తారు. అయితే, 365ఏ హైవే నిర్మించే క్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఈ రోడ్డును మూసివేశారు. దీని మీదుగా హైవేను నిర్మించడంతో ఈ రోడ్డు అక్కడితో నిలిచిపోయింది.

### రాకపోకలకు తీవ్ర ఆటంకం

అయితే, ఏదైనా రహదారి నిర్మించాలంటే ఆ ప్రదేశాన్ని మ్యాపులో గుర్తించి తరువాత క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి. రోడ్లు, చెరువులు, వాగులు, డొంక దారులు ఉంటే వాటిపై రాకపోకలకు ఆటంకం ఏర్పడకుండా హైవేను నిర్మించుకోవాలి. లేదంటే ప్రత్యామ్నాయ మార్గాలు నిర్మించాలి. ఇందుకోసం ఆ ప్రాంతంలోని ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని అలైన్‌మెంట్ పూర్తి చేయాలి. కానీ.. 365ఏ హైవే నిర్మాణ సమయంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా ఖమ్మం–కోదాడ హైవే నిర్మాణానికి అలైన్‌మెంట్ ఇచ్చారు. కానీ.. సువర్ణాపురం–ముదిగొండ రోడ్డును మూసివేశారు. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

### కిలోమీటరు దూరంలో యూ టర్న్

దీంతో ప్రయాణికులు, రైతులు సుమారు కిలోమీటరు ముందుకెళ్లి అక్కడ యూ టర్న్ తీసుకుని మళ్లీ వెనక్కు రావాల్సి వస్తోంది. ప్రధానంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పనులకు సైతం కిలోమీటర్ల మేర ప్రయాణించి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. కొందరు రైతుల పొలాలు రోడ్డుకు ఇటు కొంత, అటు కొంత ఉన్నాయి. దీంతో వారు ప్రతిసారీ చుట్టూ తిరిగి రాలేక ఇక్కట్లు పడుతున్నారు.

### ఆందోళనలు.. ప్రమాదాలు.. మూసివేతలు..

ఖమ్మం–కోదాడ హైవే నిర్మాణం మొదలుపెట్టినప్పుడు, అది పూర్తయి రాకపోకలు ప్రారంభమైనప్పుడు సువర్ణాపురం–ముదిగొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు మూతబడడంతో స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. స్థానికంగా రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తరువాత కూడా ఏమీ పట్టించుకోకపోవడంతో మరోసారి ప్రజలు నిలదీశారు. దీంతో అధికారులు స్థానికులకు దిమ్మతిరిగే సమాధానమిచ్చారు. ఇక్కడి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ముదిగొండ–న్యూ లక్ష్మీపురం రోడ్డులో అండర్‌పాస్ నిర్మించామని, మళ్లీ ఇక్కడ ఎలాంటి అండర్‌పాస్ ఏర్పాటు చేయడం వీలుకాదని స్పష్టం చేశారు. హైవే పనులకు అడ్డుపడితే కేసులు పెడతామని హెచ్చరించారు. అయినా స్థానికులు వెనుకడుగు వేయకపోవడంతో హైవేను దాటేలా చూస్తామని అన్నారు. అయితే, హైవేపై వాహనాలు అధిక వేగంతో వెళ్తాయి కాబట్టి ఆ సమయంలో ప్రమాదాలు జరుగకుండా స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ సిగ్నళ్లు ఏర్పాటు చేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హామీ ఇచ్చారు. ఆ తరువాత కొద్దిరోజులు రోడ్డు దాటడానికి అనుమతించారు. అయితే, జాతీయ రహదారి కావడంతో వాహనాలు అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నాయి. సువర్ణాపురం–ముదిగొండ మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు ఈ హైవేను దాటే క్రమంలో పలు ప్రమాదాలు జరిగాయి. దీంతో హైవేను దాటకుండా పిల్లర్లు పెట్టి అనుమతిచ్చిన మార్గాన్ని మూసివేశారు.

# దాచినా ధర రాలే..

- నిండా మునిగిన మిర్చి నిల్వ పెట్టిన రైతులు
- మార్కెట్‌లో రోజురోజుకూ పడిపోతున్న ధర
- ఏసీ రకం పంట ధర కేవలం రూ.15,500



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 3: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరల పరిస్థితి రెండు రోజులుగా చిత్ర విచిత్రంగా కనిపిస్తున్నది. సాధారణంగా మిర్చి ధర కంటే కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసిన పంటకే మంచి ధర పలికేది. కానీ.. ఈ ఏడాది మాత్రం ఏసీలో నిల్వ చేసిన పంటకంటే ఈ వానకాలం సాగు చేసిన పంటకే ఎక్కువ ధర పలుకుతుండడం విశేషం. గత ఏడాది మిర్చి సీజన్‌లో వందలాది మంది రైతులు, కొందరు మిర్చి ఖరీదుదారులు పంటను భారీగా కోల్డ్ స్టోరేజీలలో నిల్వ పెట్టారు. అప్పుడు మార్కెట్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.19 వేలు పలికింది. రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉందనే భావనతో జిల్లావ్యాప్తంగా 40 కోల్డ్ స్టోరేజీలలో 42 లక్షల బస్తాల మిర్చిని నిల్వ చేశారు. సరిగ్గా ఏడాది తిరిగే సరికి ప్రస్తుతం మార్కెట్లో మిర్చి ధర గణనీయంగా తగ్గిపోయింది. శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మిర్చి యార్డుకు వివిధ జిల్లాల నుంచి 2,288 బస్తాల మిర్చిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. ఉదయం జరిగిన జెండాపాటలో కొత్త రకం మిర్చి పంటకు గరిష్ఠ ధర క్వింటా రూ.15,800 పలుకగా, మధ్య ధర క్వింటా రూ.15 వేలు, కనిష్ఠ ధర రూ.6 వేల చొప్పున ఖరీదుదారులు కొనుగోలు చేశారు. అలాగే ఏసీ రకం మిర్చి పంట క్వింటా ధర రూ.15,500 పలికింది. సీజన్ ఆరంభంలోనే కొత్త మిర్చికి సైతం కనిష్ఠ ధర పలుకుతుండడంతో సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు.

# పోలీసు వ్యవస్థకు వన్నె తేవాలి

## గంగారం 15వ బెటాలియన్‌లో పాసింగ్ ఔట్ పరేడ్‌లో సీపీ దత్

సత్తుపల్లి, జనవరి 3: సమర్థవంతంగా విధులు నిర్వర్తించి పోలీసు వ్యవస్థకు వన్నె తీసుకురావాలని సీపీ సునీల్ దత్ ఆకాంక్షించారు. గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో 9 నెలల పోలీసు శిక్షణ ముగించుకున్న కానిస్టేబుళ్లకు పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో తమదైన పాత్ర పోషించాలన్నారు. తొలుత సీపీ సునీల్ దత్‌కు బెటాలియన్ కమాండెంట్ పీజే పీసీ ఛటర్జీ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శిక్షణార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, కవాతును తిలకించారు. శిక్షణ కాలంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శిక్షణార్థులకు, ట్రైనింగ్ స్టాఫ్‌కు సీపీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కమిషనర్ విజయ్‌బాబు, కల్లూరు ఏసీపీ రఘు, ఐబీ అసిస్టెంట్ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డీ.రంగారెడ్డి, సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్, పీఆర్వో కే.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



పాసింగ్ ఔట్ పరేడ్‌లో సీపీకి గౌరవ వందనం సమర్పిస్తున్న శిక్షణ పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

# 'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

## ప్రత్యేక సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 3: వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో రాహుల్ హెచ్‌ఎంలను ఆదేశించారు. వారిపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో స్పెషలాఫీసర్లు, హెచ్‌ఎం, వార్డెన్లతో పాఠశాలల పర్యవేక్షణ, నిర్వహణపై శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఐఏఎస్ ఆఫీసర్లను నియమించినందున స్పెషలాఫీసర్లు, హెచ్‌ఎంలు వారికి కేటాయించిన పాఠశాలలను తప్పనిసరిగా వారానికి రెండుసార్లు ఉదయం, సాయంత్రం తనిఖీ చేయాలన్నారు. ఏపీవో జనరల్ డేవిడ్, డీడీ మణెమ్మ, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, ఏసీఎంవో రమణయ్య, శ్రీరాములు, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్, సత్యవతి, రాధమ్మ, చంద్రమోహన్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.